# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ప్రధానమంత్రి–విద్యాలక్ష్మి పథకానికి కేంద్ర మంత్రివర్గ ఆమోదం తెలిపింది.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా నిర్మిస్తున్న 14 విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు భూమి పూజ చేస్తారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అమరావతి – ఏపీ డ్రోన్ విధానాన్ని రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదించింది.**
4. **తెలంగాణలో రెండో విడత సమీకృత గురుకుల పాఠశాలలను ఈనెల 14వ తేదీన మంజూరు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వెల్లడించారు.**
5. **సైబర్ నేరాలను కట్టడి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు తెలిపారు.**
6. **ఈ రోజు జాతీయ క్యాన్సర్ అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

==========================

ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ప్రధానమంత్రి–విద్యాలక్ష్మి పథకానికి కేంద్ర మంత్రివర్గ ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిన్న జరిగిన కేంద్ర మంత్రి వర్గ నిర్ణయాలను మంత్రి పాత్రికేయులకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు 7.50 లక్షల రూపాయల వరకు రుణాలు అందిస్తామని అన్నారు. ఈ పథకం ద్వారా ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని కేంద్ర మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..33.. సెకన్లు

ప్రధానమంత్రి విద్యాలక్ష్మి పథకంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. యువతకు సాధికారత కల్పించి, దేశ ఉజ్వల భవితను నిర్మించడంలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం కీలకపరిణామమని పేర్కొన్నారు.

------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 5 వేల 407 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న 14 విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణానికి భూమి పూజ చేయడంతో పాటు ఐదు నూతన సబ్‌స్టేషన్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజధాని అమరావతి పరిధిలోని తాళ్లాయపాలెంలో రాష్ట్ర ఇంధన రంగంలోనే మొదటి గ్యాస్ ఇన్సులేటెడ్ ఉప కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. వీటితో పాటు దృశ్య మాధ్యమ విధానంలో మిగిలిన సబ్‌స్టేషన్లకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అమరావతి – ఏపీ డ్రోన్ విధానానికి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసుపార్థసారధి పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన నిన్న జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం నిర్ణయాలను ఆయన పాత్రికేయులకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ (30 సెకన్లు)

అలాగే అమరావతి రాజధాని పరిధి పునరుద్ధరణ, 311 పారిశ్రామిక భూ కేటాయింపులు, పిఠాపురం పట్టణ అభివృద్ధి సంస్థ, కుప్పం ప్రాంతాభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణల నిరోధక చట్టం-2024 అమలుకు సంబంధించిన బిల్లు ప్రతిపాదనలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని మంత్రి వెల్లడించారు.

---------------------------

తెలంగాణలో రెండో విడత సమీకృత గురుకుల పాఠశాలలను ఈనెల 14న మంజూరు చేయనున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో వైరా, మధిర నియోజకవర్గాలకు చెందిన గురుకుల విద్యార్థులతో ముఖ్యమంత్రి నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత పాఠశాలల పనులను వచ్చే విద్యా సంవత్సరంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. చదువుతో పాటు విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ నిన్న ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా స్పందించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అమిత్ షాతో ఇది తొలి సమావేశమని, మర్యాదపూర్వకంగానే సమావేశమయ్యానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం, వారి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో సైబర్ నేరాలను కట్టడి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన హాక్ 2.0 సదస్సును మంత్రి నిన్న ప్రారంభించి సైబర్ నేరాలపై అవగాహన కోసం చిత్రీకరించిన వీడియోలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రియల్ గ్లోబల్ సైబర్ సిటీగా హైదరాబాద్ రూపొందుతోందని, హాక్ సమ్మిట్‌లో నిపుణుల సూచనలు సైబర్

భద్రతలో కీలకమవుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో సైబర్ భద్రతా సంస్థ ద్వారా నేరాలను తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి  తెలిపారు.

---------------------------

ప్రాణాంతక వ్యాధులలో ఒకటైన క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రోజు జాతీయ క్యాన్సర్ అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రముఖ భౌతిక, రసాయన శాస్త్రవేత్త, నోబెల్ పురస్కార గ్రహీత మేడమ్ క్యూరీ జయంతిని.. క్యాన్సర్ అవగాహనా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. పోలండ్ దేశంలోని వార్సా పట్టణంలో 1867వ సంవత్సరం నవంబర్ 7వ తేదీన జన్మించిన మేడమ్ క్యూరీ... క్యాన్సర్ వ్యాధి చికిత్సకు గణనీయంగా దోహదపడిన న్యూక్లియర్ ఎనర్జీ రేడియో థెరపీ విధానాన్ని కనుగొన్నారు. ఆమె సేవలకు గుర్తుగా  జాతీయ క్యాన్సర్ అవగాహనా దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. క్యాన్సర్ వ్యాధి పట్ల  ఆందోళన పడవలసిన అవసరం లేదని...  ఈ వ్యాధిని ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే వ్యాధి నుండి బయటపడవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

కాగా జాతీయ క్యాన్సర్ అవగాహనా దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని ఉమ్మడి కృష్ణా జిల్లా నెహ్రూ యువ కేంద్ర అధికారి సుంకర రాము తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విజయవాడలోని విజయ ఫార్మటికాల్  సైన్స్ ఫర్ ఉమెన్స్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ...30 సెకన్లు

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా సమగ్ర కుటుంబ గణనను రాష్ట్ర ప్రభుత్వం నిన్న ప్రారంభించింది. ఆయా జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు గణనను  ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మొత్తం 75 రకాల ప్రశ్నలతో  సామాజిక, ఆర్థిక వివరాలను సేకరిస్తున్నారు. సర్వేలో కుటుంబ యజమాని, సభ్యుల వివరాలను నమోదు చేయడంతో పాటు కుటుంబంలోని ప్రతి ఒక్కరి ఫోన్ నంబరు, వారుచేసే వృత్తి, ఉద్యోగ వివరాలను సేకరిస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ గణనను ఈనెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, రాష్ట్రంలో 80 వేల మంది ఎన్యుమరేటర్లు, 10 వేల మంది పరిశీలకులతో ఈ గణనను ప్రభుత్వం నిర్వహిస్తోంది.

---------------------------

తెలంగాణలోని వరంగల్‌లో మామునూర్ విమానాశ్రయం కోసం భూసేకరణను త్వరితగతిన పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని రాష్ట్ర  రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో నిన్న వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటుపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భవిష్యత్ అవసరాలను దృష్టిలోపెట్టుకొని విమానాశ్రయ నిర్మాణపనులు పూర్తిచేయాలని సూచించారు.

====================